# తిరోగమనం

సత్తి కాపరానికివచ్చిన కొత్తలో మొగుడు నర్సిగాడూ, తానూ జంటగా పట్నానికి సినిమాకు వెళ్ళారు. అదే మొదటిసారి సత్తికి ఆ పట్నం జిలుగువెలుగులు చూడటం. పట్నమంటే ఆమెకు ఎంతో ముచ్చటేసింది. ఇక్కడే వుంటే ఎంత బాగుండునో అనుకుంది.

ఇంటికి తిరిగివెళ్లాక నర్సిగాడితో చూచాయగా తన అభిప్రాయం చెప్పింది. అప్పటికి నర్సిగాడికి ఆ సలహా ఏమంత నచ్చలా.

కాని, ఆమె ఒక్కసారితో వూరుకోలా. ప్రసక్తివచ్చినప్పుడల్లా పట్నం పోయివుందామని అతడికి నచ్చచెప్పేందుకు ప్రయత్నిస్తోంది. రెండు మూడుసార్లు ఆమె మాటని లెక్క చెయ్యకపోయినా, తర్వాత తర్వాత ఆ సలహా గురించి ఆలోచించటం మొదలుపెట్టాడు. దాన్ని గురించి ఒకటి రెండు రోజులు దీక్షగా ఆలోచించాడు. తనకూ బాగానే వున్నట్టు తోచింది. చక్కగా వుంటుంది బస్తీ. ఎప్పుడు డబ్బుంటే అప్పుడు ఆమెతో కూడా సినిమాకు పోవచ్చుననుకున్నాడు.

ఆ వూళ్ళో చేసేపని పట్నంలో చేసుకుంటే రెండు పొట్టలు వెళ్ళకపోతాయా అనే ధైర్యం కలిగింది. పట్నంపోయి డబ్బు సంపాదిస్తానంటే తన తండ్రిమాత్రం కాదంటాడా? తల్లి మాత్రం గారాబంగా పెంచింది కాబట్టి, మొదట్లో ససేమిరా వద్దంటుంది. పట్టుబడితే సరే అంటుంది అనుకున్నాడు నర్సిగాడు.

పైగా, ఆ వూరువాడే నాగన్న పట్నంలో వున్నాడు. ఒకసారి నాగన్నే నర్సిగాడిని పట్నం రమ్మనమని చెప్పాడు. అక్కడ మంచిమంచి పనులు దొరుకుతాయని, పనులు లేకపోతే ఏ రిక్షా లాగైనా సంపాదించవచ్చని చెప్పాడు. ఆ మాటలు కూడా నర్సిగాడికి బాగా గుర్తున్నాయి.

చివరకు పట్నం వెళ్ళేందుకు నిశ్చయించుకున్నాడు. ఎలాగైతేనేం తండ్రిని, తల్లిని ఒప్పించి ఒకరోజు తెల్లవారగట్టున సత్తితో కూడా పట్నం బయలుదేరివెళ్ళాడు. వెళ్ళేటప్పుడు తండ్రి నర్సిగాడిచేతిలో అయిదు రూపాయలు పెట్టాడు, ఎందుకైనా వుంటాయని.

నేరుగా నాగన్న యింటికి వెళ్ళాడు. నాగన్న భార్య వీళ్ళని ఆదరించి కుశల ప్రశ్నలడిగింది. మధ్యాహ్నం నాగన్న వచ్చాడు పనిలోంచి. తన వూరువాడు తనింటికి రావటం చూసి నాగన్న ఉప్పొంగిపోయాడు. అందరూ భోజనాలు చేశారు.

మధ్యాహ్నం పనిలోకి పోయేటప్పుడు నాగన్న నర్సిగాడిని కూడా

వెంటబెట్టుకెళ్లాడు. మిల్లు మేనేజరు దగ్గరకి తీసుకెళ్ళి విషయం తెలియజేశాడు. నర్సిగాడిని ఆ మిల్లులో తాత్కాలికంగా నియమించాడు.

నాగన్న గుడిసెకు దగ్గరలోనే ఒక గుడిసె మూడు రూపాయలకు అద్దెకు యిప్పించాడు నర్సిగాడికి.

నర్సిగాడు తన కాపరం అందులో పెట్టాడు. పట్నవాసం చిత్రంగా వుంది. మిల్లుపని అంత కష్టంగా లేకపోయినా అక్కడ యజమానుల గదమాయింపులు నర్సిగాడికి తలవంపులుగా వున్నయ్. అయినా నాగన్న మాటమీద వూరుకుంటున్నాడు. అదీకాక ఆ పని ఎక్కువ రోజులుండదు. అప్పుడప్పుడు సత్తితో సినిమాలకి వెళ్తున్నాడు. పట్నం ఊరికే చూడటానికి ఎంత బావున్నా, పట్నంలో నిజంగా జీవించటం అంత సుఖంగా కనిపించలా నర్సిగాడికి. కాని, అలాగే రోజులు దొర్లిస్తున్నాడు.

❀ ❀ ❀

పని ఒత్తిడి తగ్గగానే తాత్కాలికంగా నియమించిన కూలీలను తీసేశారు మిల్లులోంచి. నర్సిగాడికి అందుమూలంగా పనిపోయింది.

నాగన్న నర్సిగాడికొక సలహా యిచ్చాడు. మిల్లు మేనేజరు రిక్షాలను అద్దెకిస్తుంటాడు. ఒక రిక్షా అద్దెకు తీసుకుంటే నాలుగు డబ్బులు సంపాదించుకోవచ్చునని చెప్పాడు. నర్సిగాడు సరేనన్నాడు.

మర్నాడు మేనేజరింటికి వెళ్ళి రిక్షా అద్దె ఖాయం చేసుకుని రిక్షా తీసుకొచ్చాడు.

లైసెన్సు తీసుకుని రిక్షా లాగడం ప్రారంభించాడు. మొదట్లో రిక్షా అద్దెకూడా గిట్టేది కాదు. కాని క్రమక్రమంగా నర్సిగాడికి బేరమాడటం, కొసరి అడగటం యిత్యాది మెళుకువలు తెలిశాయి. అద్దెపోను రోజుకు ఒకటి రెండు రూపాయలు మిగులుతున్నాయి.

సత్తికి మంచి మంచి రంగులలో జాకెట్లు కుట్టించాడు. రెండు చీరలు కూడా కొన్నాడు.

ఒకమాటు డబ్బు కూడబెట్టి తన తల్లికి చీరా, రవికా, తండ్రికి పంచా, కండువా కొని, వెళ్ళి యిచ్చొచ్చాడు. వాళ్ళెంతో సంబరపడ్డారు నర్సిగాడు ప్రయోజకుడయ్యాడని.

❀ ❀ ❀

కాని సైకిలురిక్షాలు, సిటీబస్సులు వచ్చాక రిక్షాల ఎద్దడి తగ్గింది. మామూలు లాగే రిక్షాలకి గిరాకీ లేదు. వున్నా డబ్బు ఇదివరకు మాదిరి రావటం లేదు. ఐనప్పటికీ నర్సిగాడు పట్టుదలతో సంపాదన తగ్గకుండా పొద్దుపోయేవరకు లాగుతూనే వున్నాడు. ఏరోజు కారోజు తన యజమాని అయిన మేనేజరుకు రిక్షా

అద్దె చెల్లించి మిగిలింది ఇంటి ఖర్చు క్రింద వాడుతున్నాడు. తిండికి లోటులేకుండా జరుగుతోంది.

వేన్నీళ్ళకి చన్నీళ్ళు తోడుగా వుంటాయని సత్తి కూడా ఎవరింట్లోనన్నా పనిచేస్తానని పట్టుపట్టింది. మేనేజరింట్లోనే పనిమనిషి కావలసి వుండడం మూలాన సత్తి ఆ యింట్లో పనిమనిషిగా కుదిరింది.

ఆమె పొద్దున్నే పనికిపోతుంది. తిరిగి పదకొండు పన్నెండింటికి వస్తుంది, యజమాని యింట్లో ఏదన్నా అన్నం గిన్నం పెట్టే వెంట బెట్టుకుని. ఆ వేళకే నర్సిగాడు తిరిగి వస్తాడు మధ్యాహ్నం భోజనానికి. ఇద్దరు రెండుగంటలకి ఎవరిపన్లోకి వాళ్ళు పోతారు. ఆమె సాయంకాలం ఆరుగంటలకల్లా పనిలోంచి వచ్చేస్తుంది. నర్సిగాడు మాత్రం ఎనిమిది గంటలయ్యాక వస్తాడు.

సత్తి ఎప్పుడూ ఒకళ్ళతో ఒక మాట పడి ఎరగదు. యజమానురాలు ఒకమాటు నోరుజారితే చాలా నొచ్చుకుని, అలాంటి మాటలు అనటం మంచిది కాదని చెప్పింది. యజమాని కొడుకు సత్తిని విషపుకళ్ళతో చూస్తుంటాడు. ఆ చూపంటే ఆమెకు వళ్ళుమంట. అతను ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించినా ఆమె పడనీయటం లేదు.

సత్తి యవ్వనం, ముఖంలో కళ, కళ్లలో వెలుగు అతన్ని పురిగొల్పుతున్నాయి. కాని, ఆమె నిప్పులాంటిదని భయపడుతున్నాడు. అలా అని ప్రయత్నం విరమిద్దామనే బుద్ధి రాలేదింకా.

❀ ❀ ❀

ఒకరోజు యజమాని భార్య మొదటాట సినిమాకు వెళ్లాలని నర్సిగాడిని రిక్షా తెమ్మంది. ఈ బేరంవల్ల డబ్బులు ఏవీ రాకపోయినా రిక్షా ఖామందురాలు కాబట్టి సినిమాహాలు వద్ద దిగబెట్టాడు యజమానురాల్ని, ఆవిడ ముగ్గురు పిల్లల్ని. తిరిగి హాలుదగ్గరికి తొమ్మిదిగంటలకి రమ్మని ఆదేశం యిచ్చింది నర్సిగాడికి. అలాగేనని నర్సిగాడు వేరే బేరానికి వెళ్ళాడు.

యజమానురాలు సినిమాకి బయలుదేరేటప్పుడు సత్తితో ఇల్లువాకిలి శుభ్రంగా చిమ్మి పొమ్మంది. సత్తి యిల్లంతా శుభ్రంగా చిమ్మింది. ఆఖరికి యజమాని కొడుకు కూర్చున్న గది వూడవటానికి వెళ్ళింది. ఈ ఒంటరి అవకాశంకోసం నిరీక్షిస్తున్నాడా యువకుడు. సత్తికి ఆ గదిలోకి పోవటమే యిష్టంలేదు.

అతడు కుర్చీలోంచి లేచి ఆమెను పల్కరించపోయాడు. సత్తి మారుపలక్కుండా తనపని తాను చేసుకుపోతోంది. ఊడవటం అయ్యాక దుమ్ము చీపుర్లో యెత్తి బయటకు పోబోతోంది. యజమాని కొడుకు సమయం మించిపోతోందనే ఆత్రుతతో ఆమె చేయి పట్టుకులాగి లాలనగా తన కోర్కె తెలియజేశాడు. ఆమె హుంకరించింది. యువకుడు చేయి వదల్లా. ఆమెను కావలించుకోబోయాడు. ఆమె శక్తిస్వరూపం దాల్చింది. గర్జిస్తూ ఆ మత్తెక్కిన యువకుణ్ణి వెనక్కి నెట్టింది. ఆ నెట్టుతో చరచరా

వెనక్కిపోయి కుర్చీ తగిలి వెల్లకింతలా క్రిందపడ్డాడు. ఆమె ఆ చీపురుదుమ్ము అతడి మొహానగొట్టి గబగబా ఇంటికి వెళ్ళిపోయింది.

నర్సిగాడు ఇంటికిపోకుండా తొమ్మిది గంటలకు హాలుదగ్గరకు వెళ్ళి యజమానురాల్ని, సంతానాన్ని ఎక్కించుకుని ఇంటికొచ్చాడు. యజమానురాలు దిగాక పిల్లల్ని ఒకొక్కర్నీ నర్సిగాడు భద్రంగా దింపాడు. యజమానురాలు ఒక్కొక్క కూతురి మెడలో నగల్ని పరీక్షచేస్తో చిన్నమ్మాయి మెడచూసి ఒక్కమారు గావుకేక పెట్టింది. నర్సిగాడిని నిలదీసి అడిగింది – గొలుసేమయిందని. వాడు నాకేమీ తెలియదంటూ మొరపెట్టున్నాడు. లోపలినుంచి కొడుకొచ్చి భయపడుతూనే నర్సిగాడి శరీరమంతా వెతికాడు. కాని గొలుసు వాడు దొంగిలిస్తేగా వుండేందుకు?

ఈలోగా మిల్లునుండి మేనేజరు వచ్చి సంగతి తెలుసుకుని గొంతు చించుకుని నర్సిగాడిని నానావిధాలుగా బుకాయిస్తున్నాడు. నర్సిగాడు మాటలు మిగలవద్దని అంటున్నాడు. పోలీసుకు రిపోర్టు యిస్తానని భయపెట్టున్నాడు యజమాని. సత్యం జయిస్తుందని నర్సిగాడు జంకులేకుండా చెప్తున్నాడు. నర్సిగాడిని ఎక్కడకీ కదలవద్దని ఆదేశించాడు యజమాని.

ఈ ఘర్షణ జరుగుతుండగా యజమానురాలు తన మెడలో గొలుసులు లెక్కచూసుకుంటూ ఒక్కమారు విరగబడి నవ్వింది. అందరూ బిత్తరపోయి చూశారు ఆమెవంక. పోయిందని నర్సిగాడిమీద నెపంవేసిన ఆ గొలుసు కూతురుకు పొదుగయితే తనే పెట్టుకుందట! ఆ మాట మర్చేపోయిందట!!

యజమాని నర్సిగాడిని వదిలిపెట్టాడు. కాని, నర్సిగాడు అభిమానంగల కూలిబిడ్డ. ఈ నెపం తన హృదయాన్ని మండించింది. యజమాని అల్పబుద్ధి గ్రహించి ఏవగించుకున్నాడు. అటువంటివాడిదగ్గర లోబడివుండటమే అమర్యాదని తేల్చుకున్నాడు. అదేకాదు, కాయకష్టం చేసేవాడికి గౌరవం యివ్వని ఆ బస్తీని అసహ్యించుకున్నాడు. తన నిజాయితీని తెలుసుకోలేని ఆ షావుకారికి ఆనాటి అద్దె యిచ్చేసి, యింక రిక్షా అక్కర్లేదని అక్కడే వదిలేసి బయటకు వచ్చేశాడు.

వెనకనుంచి యజమాని ఏదో చెప్పబోతున్నా వినిపించుకోకుండా యింటిదారి పట్టాడు.

❀ ❀ ❀

నర్సిగాడు ఇంటికి వెళ్లేటప్పటికి భార్య హడావుడిగా మూటాముల్లె కట్తోంది. నర్సిగాడిని చూడగానే అమాంతంగా కావలించుకొని వెక్కివెక్కి ఏడ్చింది. నర్సిగాడు ఏమీ తోచక సంగతి చెప్పమని తొందరపెట్టాడు. భార్య సంబాళించుకుని జరిగిందంతా చెప్పింది.

నర్సిగాడు నరసింహమూర్తయ్యాడు. యజమాని కొడుకు నెత్తురు తెచ్చి దాంతో సత్తిని పట్టుకున్న చేతిని కడుగుతానని బయలుదేరాడు. కాని, భార్య భర్తను నివారించింది. అలా ప్రతీకారం చెయ్యవద్దంది. ఆ బస్తీలో వుండటం తనకీ యిష్టం

లేదని చెప్పింది. మర్నాడే స్వంత పల్లెకి వెళ్ళి అక్కడే కూలిచేసుకుని బ్రతకటం ఉత్తమోత్తమమని భర్తతో చెప్పింది. నర్సిగాడుకూడా తనకు జరిగింది చెప్పి, తనూ ఇదే అభిప్రాయంలో వున్నానన్నాడు.

భోజనం చేశాక నాగన్న దగ్గరకు వెళ్ళి తన నిశ్చయం చెప్పాడు. నాగన్న చాలా విచారించాడు. అడ్డు చెప్పటం మంచిదికాదని అందుకు అంగీకరించాడు.

మర్నాడు ప్రొద్దున్నే యింటి బాకీలు యిచ్చేసి ఇద్దరూ తమ పల్లె చేరుకున్నారు.

❀ ❀ ❀

అకస్మాత్తుగా కొడుకూ, కోడలూ రావటంచూసి తల్లితండ్రులు ఆశ్చర్యపోయారు. అన్నపానాలయ్యాక తండ్రి నర్సిగాడిని గుచ్చిగుచ్చి అడిగాడు, తిరిగి రాకకి కారణమేమిటని. అసలు విషయం కోడలుగాని, కొడుకుగాని చెప్పలేదు వాళ్ళకి. బస్తీలో రిక్షా కిరాయి ఏమాత్రం గిట్టుబాటుగా లేదనీ, లాగటం చాలా శ్రమ అనీ, శ్రమకుతగ్గ ఫలితం లేదనీ, పైగా తల్లికి, తండ్రికి దూరంగా వుండటం యిష్టం లేదనీ చెప్పి సరిపుచ్చాడు నర్సిగాడు.

తిరిగి రాకకి అంతా సంతోషించారు. నర్సిగాడు తిరిగి పల్లెలో పనిపాటల్లో ప్రవేశించాడు. నిశ్చింతగా వుంటున్నాడు. సత్తి కూడా అత్తవెనక కోడలుకాబట్టి హాయిగా వుంటోంది.

ఆ పల్లెలో వాళ్లంతా నర్సిగాడినీ, సత్తినీ మెచ్చుకుంటారు, హాయిగా కొంతకాలం బస్తీలో గడిపినందుకు. తామూ బస్తీజీవనం అనుభవించాలని ఉవ్విళ్ళూరుతుంటారు యువతీయువకులు ఆ పల్లెలో.

కానీ నర్సిగాడు, భార్య ఉన్నట్టుండి పల్లెకి తిరిగి రావటానికి కారణం వాళ్ళెవరికీ తెలియదు.

*('చిత్రగుప్త', 1-1-1956)*